
పొడుస్తాను!
వాడి కళ్ళలో నా వేళ్ళు దించేసి గుడ్లను పీకేస్తాను. లేకపోతే....

లేదా? నా పెళ్ళామే వీడి కళ్ళలో దూరిందా?
'అబ్బా!' అటూ యిటు కదిలాను. కొరివి మీద కూర్చున్నట్లుంది—కొబ్బరిపీచు సీట్ల



—నాన్సెన్స్! బస్సెక్కిన దగ్గర్నుంచీ చూస్తున్నా. వాడి చూపులో మార్పులేదు. కన్నార్పటంలేదు. పక్కసీట్లో ఎవడొచ్చి తోస్తూ రాచుకు కూర్చున్నా వాడికేం పట్టటంలేదు.

—వెధవ కళ్ళలో రక్తపు జీరలు—పాము నాలుకల్లా చీలి వున్నాయి. కుంత బంద పెదాల మీద జొల్లు కారుతోంది అసహ్యంగా. ఛీ! ఛీ!

వాడి కళ్ళలో మెదిలేది లత ఒక్కతేనా?

నా పళ్ళ పటపటలు వాడి చెవుల్ని తాకుతున్నాయా?

"టిక్కెట్! టిక్కెట్!"

కండక్టరు పిలుస్తున్నా వినిపించుకోడేం? నాకు తెలుసు వాడింకా టిక్కెట్టు తీసుకోలేదని.

రాస్కెల్, వీడింతవరకు ఆడదాన్నే చూడ లేదా?

మీద.

లత బాబుకేవో బైట చూపిస్తూ కిలకిలా నవ్వుతూ ముచ్చట్లాడుతోంది.

కనుకొలుకుల్లోంచి ఆ 'మేనర్‌లెస్ క్రీచర్' ఇంకా కనబడుతూనే వున్నాడు. వాడు చూపు మరల్చకుండా లతనే చూస్తున్నాడు.

ఇక ఓపిక పట్టలేను. వాడి గుడ్లు పీకి పారేస్తాను.

అమ్మో! అది అమానుషం! ఘోరం!

అలా అనుకొని ఎంతసేపు ఓర్పు? నా 'పేషన్సు' మీద పిన్నులు గుచ్చుతున్నాడు ఆ 'బ్రూట్.'

లేచి నుంచున్నాను—వాడి చూపులకి అడ్డు గోడగా.

'మంచి పని చేశాను' నన్ను నేనే మెచ్చుకొన్నాను. వాడిక లతను చూడలేదు.





"గవర్నరుపేట సెంటరెవరండీ?"

"దిగండి త్వరగా."

కండక్టరు గొంతు చించుకుంటున్నాడు.

వాడు దిగలేదు.

అసలు వాడు దిగతాడా? బస్సులోనే పాతుకుపోతాడా?

ఆఁ! వాడు....వాడు తొంగి తొంగి లతను చూస్తున్నాడు. వీడసలు మనిషేనా?

"ఎందుకండీ లేచి నిల్చున్నారూ?" అంది లత.

కూర్చున్నాను.

నా మనసు మాత్రం మరిగిపోతోంది.

ఆ వెధవను ఓ కంట కనిపెడుతూనే వున్నాను.

ఆడదాన్ని చూస్తే అమాంతం తినిపారేసేట్టుండే వీడి చూపుల్ని సమాధి చెయ్యాలి. వీడిలాటి వెధవల్ని పట్టపగలు హత్యచేసి పారెయ్యాలి.

"గాంధీనగర్ పార్కెవరండీ?" కండక్టరు కంఠం.

"లతా! లే! లే!" నేను.

"ఇంకా దుర్గా టాకీసు రాలేదు గదండీ!" లత.

"ఇక్కడికి దగ్గరేలే. మాట్లాడకుండా దిగు."

డర్టీ బగర్ అగ్లీ లుక్స్ నుంచి లతను తప్పించుకు బైటపడ్డాను.

ర ర ర

అదుగో! వీడెవడు?

వాడికి అన్నమాదిరున్నాడే వీడు.

"పిపీ! పి....పువ్వాఁయ్....పువ్వాఁయ్."

ట్రాఫిక్ బందయి పోతున్నా పట్టించుకోడేం—?

వాడి చూపులు....వాడి పంచేంద్రియాలూ లతమీదే కేంద్రీకరింపబడ్డాయా?

ఆఁ....తప్పుకోడేం? ఆ లారీ, ఆ బస్సు, ఆ టాక్సీ ఒకదాని తర్వాత ఇంకొకటి వాడిమీద ఎక్కి పారేస్తే! పీడా విరగడై పోదూ!

లత నిశ్చింతగా నడుస్తోంది.

పోనీ వాడి చూపు వాణ్ని చావనీ.

మళ్ళీ వెనక చూపు చూడకుండా ముందుకి సాగిపోయాను.

ర ర ర

మల్లెలు, తెల్లగన్నేర్లు ఎంత చక్కగా వున్నాయి ఈ పార్కులో!

నైట్‌క్వీన్ సువాసనలు ఏ మూలనుంచో గుప్పున గుబాళిస్తున్నాయి.

"ఆహాఁ!

"లతా!"

"ఊఁ."

"వాట్ ఎ లవ్‌లీయస్ట్ లైఫ్ వుయ్ లీడ్!"

జలతరంగాల్లా లత నవ్వు.

నా తల లత ఒడిలో పెట్టుకుందామని లేచాను—ఆ మారుమూల చెట్టుకింద.

సిగరెట్టు పీలుస్తూ చూస్తున్నాడు.

చర్రున లేచి నిల్చున్నాను.

—నాకు తెలుసు ఆ రాక్షసుడి కళ్ళలో కదిలే బొమ్మ ఎవరిదో?

"ఎందుకుబే అలా చూస్తావ్?" అడిగే 'తాకత్' నాకు లేదు.

విసురుగా లతవైపు తిరిగేను.

"లతా!" అరిచేను.

ఏదో తన్మయత్వంలో వున్న లత నిండు గర్భిణిలా కదిలింది.

"లే! లే!" సినిమాకి టైమవుతోంది" తొందర చేశాను.

"అబ్బబ్బా! మీరెప్పుడూ ఇంతే." విసుగ్గా అంది లత.

"ఏం చెయ్యమంటావ్? నీ అందం నా పాలిటి శాపమై కూర్చుంది. నీకేం? రాజీవితో ఏం పట్టనట్టు వెళ్ళిపోతుంటావ్. ప్రతి అప్రాచ్యపు వెధవా చూపులతో నిన్ను కొరికేస్తుంటే నే చూడగలనా? పెళ్ళాం బెల్లం ముక్కలా జేబులో వుంటే సరిపోతుందా? నాకు తెలీకుండా ఆ బెల్లానికి చీమలు పట్టిపోతే నా బాధ నీకేం తెలుసు లతా!" అని లతకు చెప్పలేక చెయ్యి పట్టుకు లేవదీసుకు పార్కు బైట పడ్డాడు.

&

"పచ్చగడ్డి కోనేటి పడుచుపిల్లోయ్!"

"............"

"కొంగు జారి తేముంది కొంటి పిల్లోడోయ్!"

"............"

అబ్బా! ఆహుఁ....ఓహో!

ఆ పాట నేనూ లతా పాడుతున్నట్టుంది.

ఆ ప్రేమ విహంగాలం మేమే.

ఒళ్ళో వున్న బాబు కిందికించి, చేతులు ఫ్రీ చేసుకుని 'లతా' అని లత చెయ్యిమీద చెయ్యి వేశాను.

"అఁ...." లత.

కొద్దిసేపు ఒకళ్ళ శరీరంలోంచి ఇంకొకరి శరీరంలోకి చేతులగుండా "ఎలక్ట్రాన్లు" ప్రవహించేయి.

"విశ్రాంతి" తెర.

సర్దుకు కూర్చున్నాం.

సౌండు బాక్సులోంచి సంగీతం,

"లతా! కాఫీ తాగవూ?" అడిగేను.

"పదండి వెళ్దాం" బంతిలా లేచింది లత.

"నువ్వు కూర్చో. నే తెస్తాలే" అని అనలేకపోయాను.

లత ముందడుగు వేసింది.

చుట్టూ చూస్తూ అంగరక్షకుడిలా లత అడుగులో అడుగువేశాను.

"సార్ పాసు" గేటువాడు పిలిచి గేట్ పాస్ చేతిలో పెట్టేడు. పరధ్యాన్నానికి కొంచెం బాధేసింది.

కాఫీ స్టాల్—

జుర్రు జుర్రున కాఫీ త్రాగే శబ్దాలు—టిక్ టిక్ మంటూ సిగరెట్టు నుసి దులుపుతున్న చిటికెలు.

జనాన్ని తప్పించుకుంటూ కౌంటరు దగ్గరకెళ్ళి "రెండు కాఫీ లివ్వండి" లత ఆర్డరు.

ఇంత దూరంలో, భుజంమ్మీద బాబు నేసుకొని బెరుగ్గా చూస్తున్నాను నేను.

అఁ! లతలోంచి ఏదో శక్తి బైటకి పోతోంది—దానంతట అదికాదు. ఎవరో లాగేస్తున్నారు.

ఎన్ని జతల కళ్ళు లతను చూస్తున్నాయ్!

లతకు నాకు ఎంతమంది అడ్డం!

ఊఁహూఁ! లాభంలేదు.

—జనాన్ని చీలుస్తూ క్షణాల్లో కౌంటరు చేరాను.

నా కళ్ళు ఇంతింత చేసుకుని లతను కింద నుంచి పైదాకా చూసుకున్నాను. హమ్మయ్య!

లత ఏం చెక్కుచెదరలేదు.

"ఇదుగో! కాఫీ తీసుకోండి" లత.

అందుకుని గోరు వెచ్చటి కాఫీ గటగటా త్రాగేశాను.

"రండి లోపలి కెళ్దాం" లత కాఫీ కప్పు అవతల పెడుతూ.

"ఆగూ! లైట్లు పోనీ. ఇప్పుడు స్లైడ్సే వేసేది" నేను.

నా భయం నాది.

ఔను. ఇప్పుడు లైట్లుండగా లతను లోపలికి తీసుకెళ్తే ఇంకేమన్నా వుందా?

లైట్లు పోయాయి.

నేను లతతో లోపలికి పోయాను.

—హీరో హీరోయిన్‌లు పగిలిన హృదయాలతో విడిపోయారు.

లత పక్కనుంచి నా కుర్చీ తీసి నన్నెక్కడో విసిరేసినట్లనిపించింది.

చప్పున లత చెయ్యి నా చేతిలో ఇరికించుకున్నాను.

"అబ్బా! చెమటగా వుంది. ఫ్రీగా కూర్చోండి" లత నా చెయ్యి విడిపించుకుంది.

"ఛీస్...." కిసుక్కున వెనక నించి నవ్వు.






ఎవరో పోకిరీ వెధవలు.

—ట్రాజెడీ సినిమా చూసి లేచాం.

నా ట్రాజెడీ ప్రారంభం.

మెయిన్ గేటు బైట పడుతున్నాం.

"మొలలోతు నీళ్ళల్లో మొగల్లే నువ్వుంటే" నా పక్కనే నడుస్తున్న రోగ్.

"నల్లవాడనుకుని చేరదీస్తే...." ఇంకొకడు. నా నల్లరంగు వాడు పసిగట్టినట్టున్నాడు.

వీళ్ళందరి చూపులు లతమీదే.

లత ఇవేం పట్టించుకోటంలేదు. పక్క గోడలమీది వాల్‌పోస్టరు చూస్తూ ముందుకి వెళ్ళిపోతోంది.

బికారి వెధవలా పిల్లాణ్ణి భుజాన వేసుకుని నేను.

"లతా! ఏమిటా బిరితెగింపు? నాతోపాటు నడవలేవ్?" అలాగని అంతమందిలో ఖెలా అనను?

గేటు బైట పడ్డాం.

రిక్షావాళ్ళు గంటలు వాయిస్తున్నారు.

—"రిక్షా వస్తావా?" అడిగేను.

అప్పటికే ఆ నాయాల చూపులు లతమీద పడిపోయాయి.

అరె! ఆఖరికి ఈ లేబరు వెధవకూడా నా పెళ్ళాంమీదే కన్ను!

వాడి కళ్ళలో కొరివి పెట్టాలనిపించింది.

"నిన్నే అడిగేది" తమాయించుకొని గద్దించాను.

"ఎక్కడికి బాబూ?" తడుముకుంటూ చూసేడు వాడు.

చెప్పాను.

బేరం సాగింది.

ఎక్కాం.

చాలాసేపు నాకూ లతకూ మాటల్లేవు. ఆ తర్వాత ఒక చిరాకైన మూలుగు మూలిగాను.

అర్ధరాత్రి ఒంటి గంటయింది ఆ రోజు నా ట్రాజెడీ ఓ కొలిక్కి వచ్చేసరికి.

&

"ఇంత పొద్దుపోయి ఎక్కణ్ణించి వస్తున్నావ్ లతా?"

"అమ్మాయి స్కూలు హెడ్మాష్టారింటికెళ్ళి"

"ఎందుకు?"

"ఎల్లుండి స్కూల్లో యానివర్సరీ ఫంక్షనట. మన అమ్మాయి, మాస్టారి పాప కలిసి డాన్సు చెయ్యాలని ఆయన చాలా ముచ్చట పడుతున్నారు. ప్లేబాక్ నేనే" ఖుషీగా చెప్పింది లత.

"అందుకని" నాకేం తోచలేదు.

"ప్రాక్టీసుకి వెళ్ళొస్తున్నా" లత.

నా ఒంటినిండా పాములూ, మండ్రకప్పలు పాకుతున్నట్టయి పోయింది.

లత ఒక్కతే వెళ్ళటమా?

నా కడుపులో కొరివి పెట్టితిప్పుతున్నట్టయింది.

"లతా" నా గొంతు నా చెవుల్లో మార్మోగింది.

ఏమిటన్నట్టు లత చూసింది.

"....నువ్వొక్కదానివీ వెళ్ళొద్దు. రేపటి నుంచీ నేను ఆఫీసునుంచి వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి వెళ్దాం. సరేనా?'' ఆజ్ఞాపించేను.

"సరే!" తలెగరేసి వెళ్ళింది లత.

ఆ తర్వాతి రోజు లతతో కూడా నేనూ వెళ్ళేను. రోజూ వెళ్తున్నా.

క క క

లత పక్కన ఒక హార్మోనిస్టు, ఒక తబలిస్టు—వాళ్ళిద్దరి కళ్ళూ లత మొహంలో దిగబడి వున్నాయి.

"మధురా నగరిలో చల్లనమ్మ బోను
దారి విడుము క్రిష్ణా."

కోయిలకీ, కాకికీ మధ్యస్థ స్వరంలో లత గొంతెత్తింది.

మాధ్య మధ్యలో హార్మోనిస్టు లత మీదికి ఒంగి "ఇలా కాదు. అలా" అంటూ కిళ్ళీ గారాల పళ్ళు బైట పెడుతున్నాడు.

హెడ్మాష్టరు లత ముందు కూర్చున్నాడు. ఆయన కళ్ళు కమలాకాయలంత పెద్దవిగా వున్నాయి. అయినా ఆయన కళ్ళలో లత ఇమడనట్టుంది. ఇంకా పెద్దవి చేస్తూ లతనే చూస్తున్నాడు. ఆ మూర్ఖుడి నాలుక మాటిమాటికీ బైటికి వస్తూ పోతూ వుంది.

నేనో మోడామీద కూర్చున్నా—హరికథ పందిట్లో ముసలమ్మలా. లత నా గురించేం పట్టించుకోటంలేదు.

"ఆంటీ ఈ మిరియాల పాలు తీసుకోండి" ఒక తూనీగలాటి పిల్ల వచ్చి గ్లాసు అందించింది లతకి.

"ఆఁ....ఆఁ.... తీసుకోండి....తీసుకోండి" హెడ్మాష్టరు లేచి గ్లాసు తాకబోయాడు.

నా మోడా కింద అటంబాంబు ప్రేలినట్టయింది. లేచి ఫుట్‌బాల్‌లా ఆ 'ఎడ్డి' మాస్టర్ని తన్నాలనిపించింది. తమాయించుకున్నా.

"ఇంకా పిల్లల్ని పిలుద్దామా?"

"ఇంకో రెండుసార్లు ప్రాక్టీసు చెయ్యనీయండి" లత. ఆ తర్వాత నా కూతురు, ఎడ్డి మాస్టరు కూతురు వచ్చి తైతక్క లాడేరు.

ఎప్పుడు లతను జుట్టుపట్టుకు లాక్కొని యింటికిపోదామా అని రెడీగా వున్నాను నేను.

ఇంటి ముఖం పట్టేదాకా నాకు శూలాల మీద కూర్చున్నట్టయింది.

"లతా! ఏమిటిది? నీ కసలు సిగ్గుందా?" ఇంటికొచ్చినాక విరుచుకుపడ్డాను.

"ఏమైందండీ?'' తాపీగా లత.

"నన్ను ముందుంచుకుని ఆ ఎద్దె మడ్డి మాస్టారు గాడితోనూ, గారపళ్ళ హార్మోనిస్టుతోనూ కులాసా చేస్తావా? ఛీ! ఛీ!''

"ఏఁవండి'' లత కంఠం పగిలింది.

"ఏం?''

"పెళ్ళయిన దగ్గర్నించీ చూస్తున్నా-అసలు ఏమిటి మీ వుద్దేశం? బజారు తీసికెళ్తే బేజారెత్తిపోతారు. సినిమాకి తీసికెళ్తే సరిగా చూడనివ్వరు. ఏం? సన్యాసులెత్తుకు పోతారనీ?"

"లతా! ఆడదానివి. అంత అహంకారం పనికిరాదు. హద్దుమీరి అరవకు"

"ఏఁవండీ!'' ఈసారి లత కంఠం జీరబోయింది.

లత ఏడుస్తోంది.

"ఇప్పుడే, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటా. మీరూ పిల్లలూ హాయిగా వుండండి. ఇంకో పతివ్రతను వెదికి పెళ్ళి చేసుకోండి. ఆఁ'' అంటూ లత పెరట్లో నూతి దగ్గరకు పరిగెత్తింది. నా మనసు గజగజ లాడింది.

నా లత—నా బంగారు లత నూతిలో దూకుతోంది. అంతా నా అనుమానాలతో లతను పీక్కు-తింటున్నా. లతను క్షమాపణ అడుగుతా. లత నిజంగా నిప్పులాంటిదే. ఔను నా మనసే అనుమాన విష వృక్షం.

"లతా! లతా! నూతిలో పడొద్దు లతా! నన్ను క్షమించు లతా!" గొంతు పగిలేట్టు అరిచేను. పెరట్లోకి పరిగెత్తాను.

"ఏఁవండీ! ఏఁవండీ''

మెలకువ వచ్చింది.

నా పక్కనే నైట్ గౌన్‌లో లత శోభనం గదిలో మంచానికి వేళ్ళాడే మల్లెలా.

"కలగన్నట్టున్నారు. ఏమిటి?" లత

"ఆఁ....ఏమిటో! .... ఏమిటో" పైనించి కిందివరకూ లతను చూస్తుండి పోయాను □